# 39. రాజకీయ పదకోశం

**ఎన్నికల ప్రణాళిక :**

చదువురాని వాళ్ళకు కూడా అడగకపోయినా విరివిగా పంచిపెట్టబడే అందమైన అమ్మాయి పది రంగుల బొమ్మ లాంటి ఖరీదయిన ఆశల కేటలాగు.

**పార్లమెంటు**

చలువ చేసిన మల్లెపువ్వులాంటి తెల్ల బట్టల్లో గంధర్వుల్లా కనిపించే ఆరితేరిన ఉపన్యాసకుల సమావేశ మందిరం.

**ప్రతిపక్షం**

ఉద్యోగం కోసం పడిగాపులుపడే నిరుద్యోగులకూటమి.

**వాకౌట్**

మరింతసేపు అరిచే ఓపిక లేకుండా అలసిపోయిన వాక్సూరులు సోడా కోసం బయటకు పోవడం.

**మంత్రివర్గం**

పరుగు పందెంలో ప్రతిపక్షుల్ని చిత్తుచేసిన యోధుల కూటమి.

**మంత్రివర్గ సంక్షోభం**

ఊళ్ళు పంచుకోవటంలో వంతులు కుదరక తన్నుకోవటం.

పార్టీ ఫిరాయింపు

కోడిపలావు దొరకనున్నదని తెలిసి మాడిపోయిన ఆమ్లెట్‌ను వదలేసి లేచిపోవటం.

పార్టీ నాయకుడు

నూతిలో ఈతకొట్టటంలో సిద్ధహస్తతను నిరూపించుకున్న ఘనుడు.

పార్టీ కార్యకర్త

కనీసం నూతిలో నీళ్ళు తోడుకుని స్నానమన్నా చేద్దామనుకునే అమాయకుడు.

పన్నులు

నీకు పంచదార పర్మిట్ ఇప్పిస్తానని చెప్పి నీ నోటిదగ్గరున్న మిఠాయిని మింగేయటం.

ఎన్నికల సభ

చెమటలు కక్కుకునే ఉపన్యాసకుల, కునికిపాట్లు పడే శ్రోతల సమావేశం.

కాపిటలిస్టు

నీ దగ్గర రూపాయి గుంజుకుంటూ అందులో అయిదు పైసల్తో నీకు అన్నదానం చేస్తానని హామీ ఇచ్చేవాడు.

సోషలిజం

పదవిలో ఉన్న అందర్నీ కూడా మెప్పించి వారిచే కీర్తింపబడే సకల రోగనివారిణి.

**కమ్యూనిజం**

కొందరి అంచనా ప్రకారం భూతల స్వర్గం, మరికొందరి అంచనాల్లో భూతాల స్వర్గం.

**ఐక్య సంఘటన**

ఒకరి గొయ్యి మరొకరు త్రవ్వకోకుండా కొందరు పార్టీలవాళ్ళు కలిసి ఏక గ్రీవంగా ఇతర్లకు గొయ్యి త్రవ్వేందుకు చేసుకునే ఒడంబడిక.

**అవిశ్వాస తీర్మానం**

ప్రతిపక్షమంటూ ఒకటుందని గుర్తు చేసేందుకు అపుడపుడూ కాల్చబడే నాటు టపాకాయ.

**తటస్థత**

ఆలోచనలతో బుర్ర పాడుచేసుకోకుండా హాయిగా తిని నిద్రబోవటం

**ఎన్నికల ప్రచారం**

అమాయక ప్రజలకు తాము ఎన్నుకో వలసినవారిని నిర్ణయించు కోవటంలో తోడ్పడేందుకు నిస్వార్ధులైన మాయకులు శ్రమించడం.

**అభివృద్ధి నిరోధకుడు**

మనఅభివృద్ధి కాముకతను నిరూపించు కునేందుకుగాను వ్రేలెత్తి చూపించ దగిన దౌర్భాగ్యుడు.

**మురికిపేటల సందర్శన**

ఎన్నికలకు ముందు ప్రతి తెలివైన రాజకీయవేత్తా విధిగా పాటించ వలసిన మర్యాద.